సాక్షి
విశాఖపట్నం

శుక్రవారం : 15 : నవంబర్ : 2024



కూటమి మాట తప్పింది

నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 8లో



ఫస్ట్ ఫ్లీట్ సపోర్ట్ షిప్ నిర్మాణానికి శ్రీకారం 8లో



'దేవకీ నందన వాసుదేవ' సందడి

మైథలాజికల్ థ్రిల్లర్ మూవీ 'దేవకీ నందన వాసుదేవ'అని ఆ సినిమా హీరో గల్లా అశోక్ అన్నారు. 8లో

ఉక్కుపై కుట్ర

భుక్తీ కరువైంది..
భూమీ మాయమైపోతోంది..

- అగమ్య గోచరంగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల భవిష్యత్తు
- ఇప్పటికే 2 నెలల వేతనాల్లో 115 శాతం బకాయిలు
- చెల్లింపులపై సమాధానం దాటవేస్తున్న యాజమాన్యం
- ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి భూములకూ ఎసరు
- ప్రైవేట్ చేతుల్లో 2 వేల ఎకరాలు పెట్టేందుకు కూటమి సర్కారు కుట్ర
- స్టీల్‌ప్లాంట్ భూములన్నీ అప్పనంగా అప్పగించేందుకు చంద్రబాబు పావులు
- ప్రైవేటీకరణకు మడుగులొత్తుతున్న రాష్ట్ర ప్రభుత్వం
- వినతులందిస్తున్నా బుట్టదాఖలు చేస్తున్న చంద్రబాబు, పవన్



సాక్షి, విశాఖపట్నం : ఓవైపు.. ఉక్కు పరిశ్రమను ఉద్ధరిస్తామంటూ చంద్రబాబు సర్కారు ఊద రగొడుతూ.. మరోవైపు సంస్థను మరింత కుంగ దీసేందుకు కేంద్ర ప్రభుత్వంతో కలిసి కుయుక్తులు పన్నుతోంది. ఇప్పటికే నష్టాల్లో కొట్టుమిట్టాడు తున్న స్టీల్‌ప్లాంట్.. ఉద్యోగులకు జీతాలు సక్రమం గా చెల్లించలేని దుస్థితికి చేరుకుంది. ఏకంగా 115 శాతం జీతాలు బకాయిలుగా ఉంచేసి ఉద్యోగుల ఆర్థిక భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చేసిం ది. మరోవైపు స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాలు అమలు చేస్తుం టే ఇప్పుడు ఆ తానులో ముక్కగా ఉన్న కూటమి ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోంది. ఒక్కో కఠిన నిర్ణయాన్ని అమలు చేస్తూ ప్లాంట్‌ను పూర్తిగా నాశనం చేసే దిశగా నిర్ణయాలు అమలు చేస్తు న్నారు. ఇప్పటికే నష్టాల ఊబిలో కూరుకుపోయిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రోడ్డున పడేసే కుట్రకు ప్రభుత్వాలు స్కెచ్ వేశాయి. ప్లాంట్‌కు సంబంధిం చిన వేల కోట్లు విలువ చేసే భూములను అడ్డగో లుగా ప్రైవేట్ సంస్థకు ధారదత్తం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్లాంట్‌ను వీలైనంత త్వరగా నిర్వీర్యం చేసేందుకు కూటమి కుట్ర పన్నుతోందనే విషయ స్పష్టమవుతోంది.

అధికారంలోకి రాకముందు వరకూ ఉక్కు ఉద్యమం సడలనివ్వనంటూ ప్రగల్భాలు పలికిన టీడీపీ, జనసేన నేతలు.. కూటమి పేరుతో గద్దె నెక్కిన తర్వాత వాగ్దానాల్ని తుంగలో తొక్కుతూ ఉక్కును ముక్కలు చేసేందుకు ఏం చెయ్యాలో అన్నీ చేస్తున్నారన్నది ఎప్పటికప్పుడు నిరూపితమవుతోం ది. ఓవైపు కేంద్ర గనుల శాఖ మంత్రి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఇప్పట్లో జరగదని బాహాటంగా చెబు తుంటే.. మరోవైపు ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే పను ల్ని కూటమి ప్రభుత్వం చాపకింద నీరులా చేసుకుం టూపోతోంది. ఇటు ప్రజలు అటు ఉద్యోగుల ఆం దోళనలు.. ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నిర సనలను ప్రభుత్వం ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే స్టీల్‌ప్లాంట్ విక్రయించేందుకు ఉన్న అవకాశాలపైనే కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తుంటే.. కేంద్రం చర్యలకు తాళం వేస్తూ.. ప్లాంట్‌ని మరింత కుంగ దీసేందుకు ఏం చెయ్యాలో వాటిని అమలు చెయ్యడంతో రాష్ట్ర ప్రభుత్వం బిజీబిజీగా మారింది.

ఉద్యోగులకు షాక్‌లపై షాక్

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు యాజమాన్యం **ఎప్పటికప్పుడు షాక్‌లి**స్తూనే ఉంది. ఏకంగా **115 శాతం వరకూ జీత**ం బకాయిల్లో ఉండటం **తో ఉద్యోగులు ఆర్థిక ఇ**బ్బందులతో ఉక్కిరిబిక్కి **రవుతున్నారు. కొన్ని నె**లల నుంచి ఆర్థిక సమ **స్యల పేరుతో జీతాన్ని** నెలలో రెండు విడతల్లో **యాజమాన్యం చెల్లిస్తో**ంది. మొదటి వారంలో **50 శాతం నెలలో చివ**రి వారంలో మరో 50 **శాతం చెల్లిస్తోంది. అయి**తే ఇప్పటికే సెప్టెంబర్ **కు సంబంధించి 50 శా**తం జీతం పెండింగ్‌లో **ఉంది. దీంతో పాటు** అక్టోబర్ నెల జీతం నుంచి తొలివిడతలో 50 శాతం ఇవ్వకుండా కేవలం 35 శాతాన్ని ఈ నెల మొదటి వారం లో చెల్లించారు. రెండో విడత చెల్లించాల్సిన మరో 50 శాతం ఇంకా పెండింగ్‌లో ఉంది. అంటే మొత్తం 115 శాతం జీతం బకాయిగా ఉండటంతో ఉద్యోగులు విలవిల్లా డుతున్నారు. ఎన్ని కుయుక్తులు పన్నుతున్నా వెరవకుండా ఏళ్లతరబడి ఉద్యమాలు చేసి స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకునేందుకు శ్రమిస్తున్న ఉద్యోగులు, కార్మికుల ఆర్థిక మూలాలపై కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దెబ్బకొడుతున్నాయి. పోరాటం చేస్తున్న వారి ఆత్మస్థైర్యాన్ని, ఆర్థిక ఆసరాని ఛిద్రం చేస్తే.. ఉద్యమాన్ని నీరుగా ర్చొచ్చన్న కుతంత్రంతో ప్రభుత్వం వ్యవహ రిస్తోందన్న విషయం.. జీతాల చెల్లింపులతో బట్టబయలవుతోంది. దీనిపై నిలదీసేందుకు ఉద్యోగులు ప్రయత్నించినా ఉన్నతాధికారులు ఎవరూ స్పందించడం లేదు.



భూములకూ ఎసరు ?

ఓవైపు ఉద్యోగులను యాజమాన్యం ఇబ్బందులు పెడుతుంటే.. ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే పనిలో ప్రభుత్వాలు నిమగ్నమయ్యాయి. స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న ఆస్తులన్నింటినీ ధారాదత్తం చేసి.. ప్లాంట్ విలువను శూన్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం చకచకా పావులు కదుపుతోం ది. ప్రైవేట్ సంస్థల వ్యాపార విస్తరణకు సంబంధించి సుమారు 2,000 ఎకరాల భూములు అవసరం అవుతాయి. పోర్టుకు ఆనుకొని ఉన్న స్టీల్‌ప్లాంట్ భూములను అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యూహ రచన చేస్తోంది. ఈ ప్రక్రియను త్వరలోనే పూర్తి చెయ్యాలన్న దృఢ నిశ్చ యంతో చంద్రబాబు సర్కారు ప్రయత్నాలు ఇప్పటికే మొదలు పెట్టినట్లు సమాచారం. మొత్తంగా స్టీల్ ప్లాంట్ భూములను మొత్తం ప్రైవేట్ చేతిలో పెట్టి.. 'ఆంధ్రుల హక్కు.. విశాఖ ఉక్కు'ని నడిరోడ్డుపై పడేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఓవైపు.. స్టీల్‌ప్లాంట్‌ను కాపా డుకుంటామంటూ ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వం మరోవైపు ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం సరికాదంటున్నారు. ఉక్కు కర్మాగా రానికి సంబంధించి ఒక్క ఎకరం వేరే సంస్థకు ఇవ్వాలని చూసినా ఉద్యమం తీవ్రతరం చేస్తామంటూ హెచ్చరిస్తున్నారు.

స్టీల్ ప్లాంట్‌ని కబళించేందుకు కూటమి కుట్ర



అడ్డగోలు నిర్ణయాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తే చూస్తూ ఊరు కోం. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై మొసలి కన్నీరు కారుస్తూ.. భూముల విషయంలో కూటమి ప్రభుత్వం ప్రమా దకరమైన నిర్ణయాలు తీసుకుంటే తీవ్ర పరిణామాలు చవిచూడాల్సి వస్తుంది. 30 ఏళ్ల లీజుకి పీపీపీ మోడ్‌లో ఇచ్చిన స్థలాల్ని ప్రైవేట్ పరం ఎలా చేస్తారు.? పేరు మార్చేస్తే ఆ భూముల్ని అదానీ సంస్థ బ్యాంకుల్లో కుదువ పెట్టేసి.. రూ.వేల కోట్ల రుణాలు తీసుకొచ్చి వ్యాపార విస్తర ణకు కుయుక్తులు పన్నుతున్నారు. స్టీల్‌ప్లాంట్‌ని కబళించేం దుకు అదానీతో కలిసి చంద్రబాబు రహస్య కుట్ర చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగా భూములపై చర్చలు జరగకపోతే.. ఒక్క ఎకరం ప్రైవేట్‌కు ఇవ్వడం లేదని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రకటన చెయ్యాలి.

– గంగారామ్,
సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

తక్షణమే భూముల్ని ప్లాంట్ పేరిట రిజిస్ట్రేషన్ చెయ్యాలి



ఇప్పటికే జీతాల కోతతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పుడు ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు మానుకోవాలి. స్టీల్‌ప్లాంట్‌కు మొత్తం 20 వేల ఎకరాలున్నాయి. ఈ భూములు రాష్ట్రపతి పేరుతో ఉన్నాయి. ఆ భూములన్నీ స్టీల్ ప్లాంట్ పేరుతో తక్షణమే రిజిస్ట్రేషన్ చెయ్యాలి. అప్పుడు సంస్థ నికర విలువ రూ.70 వేల కోట్లకు పైగా చేరుకుం టుంది. ఇది చేస్తే చాలు.. స్టీల్‌ప్లాంట్‌ను బతికించినట్లే.. నికర విలువ పెరిగితే బ్యాలెన్స్ షీట్ బాగుంటుంది. బ్యాంకర్లు కూడా ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొస్తారు. అప్పుడు ఉత్పత్తి రెట్టిం పు చేసుకునే వెసులుబాటు ఉంటుంది కాబట్టి ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించాలి. వాస్తవానికి ఈ భూముల్ని నిర్వాసితుల దగ్గర నుంచి ప్లాంట్ కోసం మాత్రమే తీసుకున్నారు. కాదు కూడదు అను కుంటే.. ఆ భూముల్ని తిరిగి నిర్వాసితులకే ఇవ్వాలే తప్ప.. వేరే వాళ్లకు బదలాయించకూడదు.

– జె.అయోధ్యరామ్,
ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో కన్వీనర్

న్యూస్‌రీల్

ఎన్‌సీసీ క్యాడెట్‌ల సందర్శన



తీరప్రాంత భద్రత విషయాలను ఎన్‌సీసీ క్యాడెట్‌లకు వివరిస్తున్న నేవీ అధికారి

సింధియా : తూర్పు నావికాదళ కమాండ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నావల్ ఆఫీసర్ ఇన్ చార్జ్ సారథ్యంలో వివిధ కళాశాల నుంచి ఎన్ సీసీ క్యాడెట్‌లు ఈస్టర్న్ నేవల్ కమాండ్ పరిధిలోని సాగర్ ప్రహరీ బాల్ , నావల్ ఆప రేషన్స్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సంద ర్భంగా విచ్చేసిన ఎన్‌సీసీ క్యాడెట్‌లకు తూర్పు తీరంలోని తీరభద్రత అంశాలను వివరించారు.

రీసెర్చ్ స్కాలర్స్ హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా విజయ్ బాబు



నియామక పత్రాన్ని అందజేస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయ రావు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ పరిశోధ కుల వసతి గృహం చీఫ్ వార్డెన్‌గా మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్న ఆచార్య ఒమ్మి విజయ్ బాబు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజ యరావు నియామక ఉత్తర్వులను అందజే శారు. పరిశోధకులతో సమన్వయం చేస్తూ హాస్టల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచిం చారు. వర్సిటీ నుంచి సంపూర్ణ సహకారం అం దిస్తామని తెలిపారు. శుక్రవారం ఆచార్య విజయ్ బాబు బాధ్యతలు స్వీకరిస్తారు. ఇప్పటి వరకు చీఫ్ వార్డెన్‌గా ఉన్న మునిస్వామి వ్యక్తి గత కారణాలతో ఆ బాధ్యతల నుంచి తప్పు కోగా, విజయ్‌బాబును నియమించారు.

జాబ్ మేళాలో 84 మంది ఎంపిక



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి అధికారి సుబ్బి రెడ్డి

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ.ఎస్.ఎస్.డి.సి. జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యం లో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. మేళాలో 84 మం దికి వివిధ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక య్యారని జిల్లా ఉపాధి అధికారి సుబ్బిరెడ్డి తెలి పారు. కల్యాణ్ జ్యువెలర్స్, ఎస్ కే.ఎల్ అసోసి యేట్స్, హెటిరో డ్రగ్స్, శ్రీ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక య్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. విజయ బాబు ఎంపికైన విద్యార్థు లను అభినందించారు. కళాశాల వైస్ ప్రిన్సి పాల్ డాక్టర్ పి.జయ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొం దించుకొని ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకో వాలన్నారు. కార్యక్రమంలో, ఏపీ.ఎస్.ఎస్. డి.సి జిల్లా అధికారి ఎం .రమేష్ నాయుడు, జవహర్ నాలెడ్జ్ సెంటర్ కోఆర్డినేటర్ జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో ఉధృతంగా పోస్టు కార్డు ఉద్యమం



పోస్టుకార్డు ఉద్యమంలో ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టు కార్డు ఉద్యమం ఉధృతంగా సాగుతోంది. స్టీల్‌ప్లాంట్‌లో ప్రైవేటీకరణ వెనక్కి తీసుకోవాలని ఉక్కు ఉద్యోగులు పోస్టు కార్డులు పెద్ద ఎత్తున పంపారు. ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో భాగంగా ప్రధాని నరేం ద్ర మోదీకి 10 లక్షల పోస్టు కార్డులు పంపాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో కార్మికులు పోస్టు కార్డులపై సంతకాలు చేశారు. కార్మిక సంఘాల నాయ కులు మాట్లాడుతూ అనేక ఉద్యమాల ఫలితం గా ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిం చడాన్ని చేస్తున్న ఉద్యమాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లాల్సి ఉందన్నారు. ఇంజినీరింగ్ షాప్స్ వద్ద జరిగిన కార్యక్రమంలో సీటు నాయకులు జె. అయోధ్యరామ్, వై.టి. దాస్, టి.వి.కె. రాజుతో పాటు ఆయా విభాగాల కార్మిక సం ఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మనోవికాసం

గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించిన కలెక్టర్ హరేందిర ప్రసాద్



పాఠకులతో మాట్లాడుతున్న కలెక్టర్

డాబాగార్డెన్స్ :పుస్తక పఠనం ద్వారా అజ్ఞానం తొలగి పోతుందని, పేదరికం కనుమరుగవుతుందని, యువ తకు బంగారు భవిష్యత్తు సిద్ధిస్తుందని కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ అన్నారు. విద్యార్థులు, యువత గ్రంథాలయాలకు రావాలని, పుస్తకాలు చదవడం అల వాటుగా మార్చుకోవాలన్నారు. సూర్యాబాగ్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రం థాలయాలు మనందరికీ దారిచూపే లైట్ హౌస్‌లు వంటివని అభివర్ణించారు. అలాగే బాలల దినోత్స వాన్ని పురస్కరించుకొని అదే ప్రాంగణంలోని నెహ్రూ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. పిల్లలందరికీ బాలల దినోత్సవ శుభాకాం క్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రోద్బలం, విద్యాశాఖ మంత్రి సహకారంతో జిల్లాలోని గ్రం థాలయాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుం టున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్, జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు, డివిజనల్ పీఆర్వో డి. నారాయణరావు, స్థానిక ఎంఈ వోలు, గ్రంథాలయ సంస్థ అధికారులు, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్న ఉపాలయ పరిచారకుడు సస్పెన్షన్

సింహాచలం: శ్రీ హహలక్ష్మీనృసింహస్వామి దేవస్థా నానికి ఉపాలయంగా ఉన్న కొండదిగువ పైడితల్లి అమ్మవారి ఆలయంలో పరిచారకుడిగా విధులు నిర్వ హిస్తున్న ఎమ్. సుబ్బారావును సస్పెండ్ చేసినట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు గురు వారం తెలిపారు. సుబ్బారావుపై ఇటీవల విశ్వహిం దూ పరిషత్ నాయకులతో పాటు పలువురు ఈవోకి ఫిర్యాదు చేశారు. కొండదిగువ పైడితల్లి ఆలయానికి బదిలీ చేసినా సుబ్బారావు ఇంకా గతంలో పనిచేసిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ వంటగదిని తన ఆధీనం లో ఉంచుకున్నారని, బినామీ అర్చకులను పెట్టుకుని విధులకు గైర్హాజరు అవుతున్నారని, ఇంకా అనేక విష యాలను లిఖితపూర్వకంగా ఈవోకి లిఖిత పూర్వకం గా ఫిర్యాదు చేశారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపిన ఈవో సస్పెన్షన్ వేటు వేశారు. అలాగే దేవస్థా నంలో ఒక మహిళా సూపరింట్ తీరుపై సీఎంకు పలువురు ఫిర్యాదు చేయడంతో దేవస్థానం డిప్యూటీ ఈవోని విచారణకు ఆదేశించినట్టు ఈవో తెలిపారు.

జిల్లా విద్యాశాఖలో మూడు ముక్కలాట

డీవైఈవోల మార్పుపై సర్వత్రా చర్చ



డీఈవో కార్యాలయం

విశాఖ విద్య: జిల్లా విద్యాశాఖలో పర్యవేక్షణాధికారు లను కుదురుగా నిలవనీయడం లేదు. జిల్లా ఉప విద్యాశాఖాధికారిగా ఆరు నెలల్లోనే ముగ్గురు అధికా రులు మారిపోయారు. గోపాలపట్నం ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్న అంబటి సోమేశ్వరరావుకు తాజాగా డిప్యూటీ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇటీవల చినగదిలి ఎంఈవో రవీంద్రబాబును ఇంచార్జి డీవైఈవోగా నియమించగా, తాజా ఉత్తర్వులతో ఆయన తన మాతృస్థానానికి వెళ్లక తప్పలేదు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న నేప థ్యంలో జిల్లా విద్యాశాఖలో చోటుచేసుకుంటున్న మార్పులు–చేర్పులు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. భీమునిపట్నం డైట్‌లో సీనియర్ లెక్చ రర్ గౌరీ శంకర్ డీవైఈవోగా కొంతకాలం పని చేయగా, ఆయన ఉద్యోగోన్నతిపై వేరే జిల్లాకు వెళ్లిపోయారు. దీంతో పెందుర్తి ఎంఈవో సువర్ణకు డీవైఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిం చారు. ఎప్పుడో జరిగిన బడి బియ్యం మిస్సింగ్ వ్యవహారంలో ఆమెను బాధ్యురాలిని చేస్తూ సస్పెం డ్ చేయటంతో అనివార్యంగా డీవైఈవోగా చినగ దిలి ఎంఈవో రవీంద్రబాబుకు అప్పగించారు. ఆయన డీవైఈవోగా బాధ్యతలు తీసుకొని రెం డున్నర నెలలు కావొస్తుండగా, ఇంతలోనే గోపాలప ట్నం ఎంఈవో అంబటి సోమేశ్వరరావుకు ఆ బాధ్య తలు అప్పగిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాలో ప్రస్తుతం పనిచేస్తున్న ఎంఈవోలలో సోమేశ్వరరావు సీనియర్ అని చెబుతుండగా, మరి రవీంద్రబా బును ఎలా ఆ సీట్లో కూర్చొబెట్టారనేది ఉపాధ్యాయ వర్గాల నుంచి వినిపిస్తున్న ప్రశ్న. వచ్చే మార్చిలో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఇం దుకు సంబంధించి ఓటర్ల నమోదు ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఇలాంటి సమయంలో కీలక మైన డీవైఈవో పోస్టులో అధికారుల చేర్పులు–మా ర్పులు చేయడం గమనార్హం. ప్రైవేటు స్కూళ్లు అత్య ధికంగా ఉన్న విశాఖ నగరంలో చోటు చేసుకుం టున్న ఇలాంటి వ్యవహారాలపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మొత్తం పరిణామాలతో విద్యాశాఖ కార్యకలాపాలపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడుతోందని ఉపాధ్యాయులు అంటున్నారు.

కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగు ణంగా కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరిం చడానికి సిద్ధం కావాలని సంయుక్త కలెక్టర్ కె.మ యూర్ అశోక్ సూచించారు. ఎండాడ జిల్లా వ్యవ సాయ అధికారి వారి సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది గురువారం ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులకు జేసీ హాజరై పలు సూచనలు చేశారు. కళ్లాల్లోని ధాన్యం, తేమ శాతం కనుగొనే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిం చుకోవాలన్నారు. గతంలో మాదిరి కొనుగోలు మిల్లులు వద్ద తేమ శాతం వ్యత్యాసానికి అవకాశం లేకుండా సంబంధిత పరికరాలు సిద్ధం చేశామ న్నారు. కొనుగోలు కేంద్రం నుంచి మిల్లులకు వెళ్లే వరకు జీపీఎస్ ద్వారా పర్యవేక్షించునట్టు చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో 40 రైతు సేవ కేంద్రాలను 10 క్లస్టర్లుగా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రబీ 2024–25 సీజన్‌లో వరి పంట సాగు తగ్గించి చిరుధాన్యాల సాగు ప్రోత్సహించాల న్నారు. ముఖ్యంగా రాగి పంట సాగును ప్రోత్సహిస్తూ సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. అనం తరం వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో ఉన్న ప్రకృతి వ్యవసాయ కార్యాలయం, పురుగు మం దుల పరీక్ష కేంద్రం, జీవీ నియంత్రణ పరీక్ష కేంద్రం , సంచార భూసార పరీక్ష కేంద్రాలను పరిశీలిం చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనే జర్ శ్రీలత, జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భా స్కరరావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రమేష్, వ్యవ సాయ సహాయ సంచాలకులు, మండల వ్యవ సాయ అధికారులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు సూపర్ 6 హామీలన్నీ బూటకమే

- ఏ ఒక్క పథకానికి సక్రమంగా బడ్జెట్ కేటాయింపులు లేవు
- ప్రజావ్యతిరేకతను తప్పించుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్
- చంద్రబాబు అబద్ధాలకోరు
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజం



ఎంవీపీకాలనీ: అధికారమే లక్ష్యంగా చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ 6 హామీలన్నీ బూటక మేనని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. లాసన్స్ బే కాలనీలోని శాసన మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని కల్లో చంద్రబాబు బృందం అనేక అబద్ధాలను ప్రచారం చేసి గద్దెనెక్కిందన్నారు. సూపర్ -6తో ప్రజలను మభ్యపెట్టారన్నారు. అయితే ప్రస్తుతం చం ద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సూపర్ 6 పథకాల్లో ఏ ఒక్క పథకానికి సరైన కేటాయింపులు చేయలేదన్నారు. సూపర్ 6 అమలుపై చంద్రబాబు ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో ఈ కేటాయిం పులే చెబుతున్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత కూడా చంద్రబాబు అబద్దాలు మానలేద న్నారు. గత ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిందని ముఖ్య మంత్రి హోదాలో చంద్రబాబు పలు సందర్భాల్లో చెప్పారని..అయితే ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రం అప్పు రూ.6 లక్షల 40 వేల కోట్లుగా వెల్లడిం చారన్నారు. దీన్ని బట్టి ఇన్నాళ్లు రాష్ట్ర అప్పులు రూ.14 లక్షల కోట్లని చెప్పిన చంద్రబాబు ఎంతటి అబద్ధాలకోరో అర్థమవుతోందన్నారు. ఈ రూ.6ల క్షల 40 వేల కోట్లు అప్పులో రూ.3లక్షల 13 వేల కోట్లు గత చంద్రబాబు టైంలో చేసినవేనన్నారు. చం ద్రబాబు చేసిన అప్పు టీడీపీ నాయకులు, కార్యక ర్తలు దోచుకోవడం కోసమే వినియోగించారని దుయ్యబట్టారు. 2019 నుంచి 2024 మధ్య జగన్‌మో హన్‌రెడ్డి ప్రభుత్వం రూ.3 లక్షల కోట్లు అప్పుచేస్తే అందులో రూ.2లక్షల 75 వేల కోట్లు రాష్ట్ర ప్రజల సం క్షేమానికే ఖర్చు చేసింద న్నారు. ఎన్నికల్లో ఇం ట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తానని ప్రకటించిన చంద్రబాబు దానికి బడ్జెట్‌లో రూ.12,500 కోట్లు కేటాయింపులు చేయాల్సివుం డగా కేవలం రూ.5 వేల కోట్లే కేటాయించారన్నారు. నిరుద్యోగ భృతికి ఒక్కరూపాయి కూడా కేటాయించ లేదన్నారు. 18 ఏళ్లు దాటిన మహిళల కోసం ప్రకటిం చిన ఆడబిడ్డ నిధి పథకం అమలుకు రూ.26 వేల కోట్లు అవసరం కాగా తగిన కేటాయింపులు చేయ లేదన్నారు. సీఎం చంద్రబాబు ప్రకటించిన పథకా లకు మొత్తంగా ఏడాదికి రూ.1 లక్ష 20 వేల కోట్లు అవసరం అవుతుండగా బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. ఇదీ పథకాల అమలుపై ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వస్తున్న ప్రజా వ్యతిరే కతను కప్పిపుచ్చుకునేందుకు సోషల్ మీడియా కార్య కర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపిం చారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భయపడేది లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల పేరుమీద టీడీపీ, కూటమి వారు అప్పుడు ఐడీలు క్రియేట్‌చేసి సోషల్ మీడి యాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపిం చారు. కూటమి నాయకుల అబద్ధాలను, డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రజలు నిశితంగా గమనిస్తున్నా రన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యా లయ ఇన్‌చార్జ్ రవిరెడ్డి, కార్పొరేటర్ మహమ్మద్ ఇమ్రాన్, జిల్లా పార్టీ ఐటీ విభాగం అధ్యక్షుడు బొం డా ఉమా, పార్టీ నాయకుడు దొడ్డి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా బాధిత కుటుంబాలను పరామర్శించిన అమర్‌నాథ్



రమణారెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

మద్దిలపాలెం: ఎవరూ భయపడొద్దు..పార్టీ అండగా ఉంటుంది..న్యాయ స్థానాలపై నమ్మకం ఉంది.. న్యాయం గెలుస్తుందన్న నమ్మకం ఉంది..అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడి వాడ అమర్‌నాథ్..సోషల్ మీడియా బాధిత కుటుం బాలనుద్దేశించి మాట్లాడారు. మద్దిలపాలెం 23వ వార్డులో సోషల్ మీడియా కార్యకర్త రమణారెడ్డి కుటుంబీకులను అమర్‌నాథ్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇచ్చిన హామీలు అమలు చేయని చంద్రబాబు..ప్రశ్నించి నవారి నోరునొక్కే ప్రయత్నాల చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులను టార్గెట్ చేసి..వారిని అక్రమంగా అరెస్టులు చేయడం తగదన్నారు. గతంలో ఇలాంటి దుశ్చర్యలు జరగలే దన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యాలయం ఇన్‌చార్జ్ రవి రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు మొల్లు అప్పారావు, కార్పొరేటర్ మహమ్మద్ ఇమ్రాన్, జిల్లా పార్టీ ఐటీ విభాగం అధ్యక్షులు బొండా ఉమా, పార్టీ నాయకులు దొడ్డి కిరణ్, పులగం సూర్యనారాయణ రెడ్డి , పులగం శ్రీనివాస్ రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సహకార రంగం బలోపేతమే లక్ష్యం

జిల్లా సహకారశాఖ అధికారి ప్రవీణ



మాట్లాడుతున్న సహకారశాఖ అధికారి ప్రవీణ

విశాఖ విద్య: పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆదు కోవడం ద్వారా సహకార శాఖను బలోపేతం దిశగా తీసుకు వెళ్లాలని జిల్లా సహకార శాఖ అధికారి టి. ప్రవీణ అన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా గురువారం విశాఖ నగరం లోని మద్దిపాలెంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కేంద్ర కార్యాలయ ప్రాంగణంలో సీఈవో డీ.వీ.ఎస్.వ ర్మతో కలిసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రవీణ మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యాల సాధ నలో భాగంగా సహకార సంఘాలు మరింత ఆర్థిక పురోభివృద్ధి చెందాలన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలను ఆదుకునే విషయంలో సహకార శాఖ కీలక పాత్ర పోషించాలన్నారు. బ్యాంకు సీఈవో డీ.వీ.ఎస్. వర్మ మాట్లాడుతూ డీసీసీబీ కార్యకలాపాలను విస్తృత ప్రచారం కల్పించేలా సహకార వారోత్సవాలను నిర్వ హిస్తున్నామన్నారు. సహకార సంఘాలను కంప్యూట రీకరణ చేసి, సేవలు మరింత వేగంగా అందించే దుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూని యన్ లెక్చరర్ జి. సోమేశ్వరరావు, బ్యాంకు జీఎం బి.శ్రీనివాసరావు, డీజీఎం అశోక్ కుమార్, ఏజీఎం యం. శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫస్ట్ ఫ్లీట్ సపోర్ట్ షిప్ నిర్మాణానికి శ్రీకారం


పూజ చేస్తున్న భారత నేవీ కంట్రోలర్ ప్రొడక్షన్ వైస్ అడ్మిరల్ శివకుమార్

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ఫస్ట్ ఫ్లీట్ సపోర్ట్ షిప్ నిర్మాణ పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. బిల్డింగ్ డాక్ వద్ద భారత నేవీ కంట్రోలర్ ప్రొడక్షన్ వైస్ అడ్మిరల్ బి.శివకుమార్ పూజలు చేసి.. కీలు లేయింగ్ పనులు ప్రారంభించారు. ఈ షిప్ 44,000 టన్నుల బరువుతో నిర్మిస్తారు. ఇందులో 80 శాతం స్వదేశీ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. సముద్ర ఫ్లీట్ విధుల్లో ఇంధనం, మంచినీరు, ఆయుధ సంపత్తిని అందించడంలో ఈ షిప్ కీలకపాత్ర పోషించనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఎనిమిదేళ్ల కాలంలో 169 లక్షల పని దినాలను కార్మికులకు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు సంస్థ సీఎండీ కమాండర్ హేమంత్ ఖత్రి తెలిపారు. 550కి పైగా ఎంఎస్ఎంఈలకు అవకాశాలు లభిస్తాయన్నారు. డైరెక్టర్లు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్- లక్నో మధ్య ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం: సికింద్రాబాద్-లక్నో-సికింద్రాబాద్(వయా దువ్వాడ మీదుగా) ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. వారణాసి, అయోధ్య ప్రయాణికులకు ఈ రైలు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్-లక్నో(07084) స్పెషల్ ఈ నెల 15, 22(శుక్రవారం)వ తేదీల్లో సికింద్రాబాద్‌లో రాత్రి 7.05 గంటలకు బయలుదేరుతుంది. మరుసటి రోజు ఉదయం 5.55 గంటలకు దువ్వాడ చేరుకుని.. అక్కడ నుంచి 5.57 గంటలకు బయలుదేరి తర్వాత రోజు సాయంత్రం 6 గంటలకు లక్నో చేరుకుంటుంది. లక్నో-సికింద్రాబాద్ (07083) స్పెషల్ ఈ నెల 18, 25 (సోమవారం)వ తేదీల్లో ఉదయం 9.50 గంటలకు లక్నోలో బయలుదేరుతుంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.32 గంటలకు బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు 17 థర్డ్ ఏసీ కోచ్‌లతో నడుస్తుంది.

కూటమి ప్రభుత్వం మాట తప్పింది

- నిత్యావసర ధరలు అదుపుచేయకపోతే ఉద్యమం ఉధృతం: సీపీఎం


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు. ధర్నాలో పాల్గొన్న మహిళలు, పార్టీ నేతలు

సీతమ్మధార: నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉంచాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. మరింత పెరిగేలా వ్యవహరించడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తీవ్రంగా మండిపడ్డారు. దీనికి తోడు విద్యుత్ ట్రూఅప్, ఇంధన చార్జీలు భారీగా పెంచి ప్రజలపై భారం వేయడం దారుణమన్నారు. ధరలు అదుపు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ధరల తగ్గింపు, స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం, మహిళలకు రక్షణ, యువతకు ఉపాధి తదితర డిమాండ్లతో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం భారీ ధర్నా జరిగింది. ధర్నా అనంతరం తహసీల్దార్ ఎం.రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కష్టారావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో జగ్గునాయుడు మాట్లాడారు. ఎన్నికల ముందు ధరలు అదుపు చేస్తామని కూటమి నాయకులు ఇచ్చిన హామీని అమలు చేయకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. రేషన్ డిపోల ద్వారా నాణ్యమైన బియ్యం, 16 రకాల నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం డిస్కంలను ప్రైవేట్‌పరం చేస్తే.. దానిని చంద్రబాబు ప్రభుత్వం గతంలో, ఇప్పుడు అమలు చేస్తున్నారని ఆరోపించారు. సీపీఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌ను రక్షిస్తామన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్.. నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ప్లాంట్ భూములను అదానీకి కట్టబెట్టేందుకు చంద్రబాబు పూనుకోవడం దారుణమన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.మణి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ, జనసేన, కూటమి ప్రభుత్వాలు కార్మికులకు, రైతులకు ద్రోహం చేస్తున్నాయన్నారు. చట్టాలు ఉన్నప్పుడే కార్మికులకు ఏ న్యాయం జరగడం లేదని, ఇప్పుడు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తేవడం వల్ల ఉన్న భద్రత కోల్పోవాల్సి ఉంటుందన్నారు. పోలీసులతో కార్మిక ఉద్యమాలను అణచివేయడంలో చంద్రబాబు దిట్టన్నారు. మద్యం ఏరులై పారుతోందని, దీని వల్ల ఆడపడుచుల జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. ధర్నాలో జగదాంబ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు, జిల్లా కమిటీ సభ్యులు యు.ఎస్.ఎన్.రాజు, వి.నరేంద్రకుమార్‌లు ప్రసంగించారు. జోన్ నాయకులు పి.శంకరరావు, కె.కుమారి, జి.అప్పలరాజు, వరలక్ష్మి, కె.మణి, పి.గౌరీష్, అప్పారావు, చంద్రశేఖర్, నాయుడు, ఎం. చంటి, కుమార్ మంగళం పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసమే విజయానికి సోపానం

- కలెక్టర్ హరేందిర ప్రసాద్


ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

కొమ్మాది: పోటీ ప్రపంచంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే ఆత్మవిశ్వాసమే సోపానంగా నిలుస్తుందని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అన్నారు. గీతంలో గురువారం జరిగిన జవహర్ నవోదయ విద్యాలయాల ప్రాంతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ రంగంలోనైనా ఉన్నత స్థానానికి చేరాలంటే నమ్మకం ఉండాలని, లక్ష్య సాధనకు నూటికి నూరు శాతం కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారతీయులు ప్రపంచంలోని మేటి సంస్థలకు కీలక స్థానాల్లో పనిచేయడం గమనిస్తే.. ప్రపంచంలో ఎలాంటి పోటీకైనా సరితూగగలమన్న నమ్మకం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ప్రకృతి విపత్తులు వంటి సంక్షోభ సమయంలో కంగారు పడకుండా స్పష్టమైన కార్యాచరణతో పనిచేయవచ్చన్నారు. సమాజసేవకు సివిల్ సర్వీస్‌లోకి ప్రవేశించడం ఒక్కడే మార్గం కాదని, స్వచ్ఛంద సేవ ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావచ్చన్నారు. తాను ఇంజినీరింగ్, ఎంబీఏ పూర్తి చేసి ప్రముఖ ఐటీ సంస్థలో పనిచేసినప్పటికీ.. సివిల్ సర్వీస్‌లోకి ప్రవేశించడానికి గల కారణం సమాజానికి ఉపయోగపడాలన్న సంకల్పమేనన్నారు. గీతం అధ్యక్షుడు, ఎంపీ శ్రీ భరత్, గీతం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, జవహర్ నవోదయ విద్యాలయ సహాయ కమిషనర్ డా. ఇ.ఉమాపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోస్తనీనదిలో కారు బోల్తా

- డ్రైవర్ మృతి



తగరపువలస: వంతెనపై నుంచి వాహనం గోస్తనీ నదిలోకి దూసుకుపోయిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ప్రత్యక్షసాక్షులు, పోలీసులు తెలిపిన వివరాలివీ.. భోగాపురం ఎయిర్‌పోర్టు పనులకు కేటాయించిన ఏపీ39యుఎక్స్1582 మహీంద్రా బొలెరా వాహనం మధురవాడలో సంబంధిత ఉద్యోగులను దించి తిరిగి తగరపువలస మీదుగా భోగాపురం వైపు వేగంగా వెళ్తోంది. ఈ క్రమంలో వంతెనపై అదుపు తప్పి ముందుగా ఫుట్‌పాత్‌ను తరువాత సిమెంట్ రెయిలింగ్‌ను ఢీకొట్టి నదిలో పడిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు టి.నగరపాలెం పంచాయతీకి చెందిన యువకుల సాయంతో వాహనాన్ని పరిశీలించగా.. కొన ఊపిరితో డ్రైవర్ కనిపించాడు. వెంటనే అంబులెన్స్‌లో సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు తగరపువలసకు చెందిన సురేందర్ (24)గా గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విమ్స్‌లో ఉద్యోగాల పేరుతో మోసం

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాలివీ. అల్లిపురం ప్రాంతానికి చెందిన వంశీ చినవాల్తేరుకు చెందిన మౌనిక, భార్గవికి విమ్స్‌లో సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఇందుకోసం భార్గవి వద్ద రూ.80 వేలు తీసుకున్నాడు. మౌనికతో రూ 1.20లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. విమ్స్‌లో గతంలో జరిగిన నియామకాల సమయంలో అభ్యర్థులకు ఇచ్చిన అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను డూప్లికేట్ చేయించి, దానిపై అప్పటి విమ్స్ డైరెక్టర్ కె.సత్యవరప్రసాద్ పేరును ముద్రించాడు. ఈ నకిలీ ఆర్డర్‌ను భార్గవికి ఇచ్చాడు. మౌనిక డబ్బులు చెల్లించకపోవడంతో ఆమెకు ఆర్డర్ ఇవ్వలేదు. ఈ క్రమంలో మౌనిక.. ఆమె తల్లితో కలసి రెండు రోజుల కిందట విమ్స్‌కి వచ్చి ఉద్యోగాల గురించి ఆరా తీయడంతో అసలు విషయం బయటపడింది. ఈ విషయం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు దృష్టికి వెళ్లింది. ఆయన బాధితులతో మాట్లాడి ఇలాంటి అపాయింట్‌మెంట్లు చెల్లవని, ప్రస్తుతం విమ్స్‌లో ఎటువంటి నియామక ప్రక్రియ చేపట్టడం లేదని స్పష్టం చేశారు. నోటిఫికేషన్ ద్వారా మాత్రమే ఉద్యోగ నియామకాలు జరుగుతాయన్నారు. దీంతో బాధితులు వంశీపై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణ తెలిపారు.

విమ్స్ ఉద్యోగి పాత్ర? : విమ్స్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఈ నకిలీ అపాయింట్‌మెంట్లు తయారు చేసి ఇచ్చినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. విమ్స్ సిబ్బందితో కూడా ఇదే విషయం చెప్పినట్లు సమాచారం. దీంతో ఈ విషయం చర్చనీయాంశమైంది. గతంలో ఆ ఉద్యోగి ఇలాంటి మోసాలెన్నో చేశాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బిర్యానీ కోసం వచ్చి.. విద్యుదాఘాతానికి గురై..

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సింగ్ కళాశాల విద్యార్థిని


ప్రమాదం జరిగింది ఇక్కడే..

సీతమ్మధార: నర్సింగ్ కళాశాల గోడ దూకి బయటకు రావడానికి ప్రయత్నించిన ఓ యువతి విద్యుదాఘాతానికి గురైన సంఘటన ఇది. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన స్నేహాదాస్ సంగం-శరత్ థియేటర్ల వెనుక గల సెవెన్ హిల్స్ నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ కోర్సు చదువుతోంది. ఇక్కడి విద్యార్థులు ప్రాక్టికల్స్ నిమిత్తం రాక్‌డేల్ లేఅవుట్ వద్ద గల సెవెన్ హిల్స్ ఆస్పత్రికి వెళుతుంటారు. ఈ క్రమంలో ఆమెకి ఆస్పత్రిలో సుశాంత్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. కాగా.. మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో మేట్రిన్ గదులు తనిఖీ చేసి వెళ్లిపోయారు. బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో స్నేహాదాస్ స్నేహితుడికి ఫోన్ చేసి బిర్యానీ కావాలని అడగడంతో అతను కళాశాల ఎడమ వైపు గోడ వద్దకు వచ్చాడు. దీంతో ఆమె స్నేహితులకు చెప్పకుండా మేడపై నుంచి ప్రధాన ద్వారం పక్కన ఉన్న కిటికీలోంచి బయటకు వచ్చింది. అవతల వైపునకు వెళ్లేందుకు గానూ ఆమె గోడ దూకుతున్న సమయంలో అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలు చేతికి తగిలాయి. ఈ క్రమంలో శరీరానికి మంటలు వ్యాపించి పెద్ద శబ్దంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే సెక్యూరిటీ గార్డు, ఇతర సిబ్బంది భయాందోళనలతో కిందకి వచ్చారు. ఆమె శరీరంపై వ్యాపించిన మంటలు అదుపు చేసి.. సెవెన్‌హిల్స్ ఆస్పత్రికి తరలించారు. ఏసీపీ లక్ష్మణమూర్తి, నాలుగో పట్టణ సీఐ ఎస్.విజయకుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఆ యువతి 30 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతోంది. హాస్టల్ యాజమాన్యం ఇచ్చిన సమాచారం మేరకు ఆమె తల్లిదండ్రులు విశాఖ చేరుకున్నారు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ కెమెరాల్లేవ్..

ప్రమాదం జరిగిన నర్సింగ్ కళాశాల ఆవరణలో ఎక్కడా సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం. కొన్ని పాత సీసీ కెమెరాలు ఉన్నా అవి పనిచేయడం లేదని పోలీసులు గుర్తించారు. ఈ కళాశాలలో 180 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. కానీ ఇద్దరే సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వహిస్తున్నారు. కాగా.. కళాశాలలో సీసీ కెమెరాలు వెంటనే ఏర్పాటు చేయాలని నోటీసులు జారీ చేసినట్లు ఈస్ట్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి తెలిపారు.

ఆక్సిజన్ టవర్స్‌లో అగ్ని ప్రమాద నష్టం రూ.20 లక్షలు!

సీతమ్మధార: ఆక్సిజన్ టవర్స్‌లో బుధవారం రాత్రి జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో సుమారుగా రూ.20 లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని అగ్నిమాపక శాఖ సిబ్బంది అంచనా వేశారు. టవర్స్‌లోని 30 అంతస్తు 3003 ఫ్లాట్‌లో శ్రీనివాస్ కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆయన వ్యాపారి. శ్రీనివాస్ తన భార్యతో కలిసి బుధవారం రాత్రి నగరంలో ఒక ఫంక్షన్‌కు వెళ్లారు. లోపల ఇంటర్ చదువుతున్న కుమారుడిని ఉంచి ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. వారి కుమారుడు బాల్కనీలో రాత్రి 11.40 గంటల సమయంలో బాణసంచా కాల్చుతుండగా అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో ఫ్లాట్‌లోని బెడ్‌రూమ్‌లో టీవీ, ఫర్నిచర్, ఇంటీరియర్ డిజైన్ పూర్తిగా కాలిపోయింది. ఇది గమనించిన తోపుడుబండి వర్తకులు ఫ్లాట్ తలుపులు విరగ్గొట్టి.. విద్యార్థిని రక్షించారు. అగ్నిమాపక శాఖ రీజినల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్‌రెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది రెండు శకటాలతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఎంవీపీ పోలీసులు, తహసీల్దార్ ఎం.రమేష్ ఈ ప్రమాదంపై వివరాలు సేకరించారు.

లోకేష్‌కు వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ


బక్కన్నపాలెంలో లోకేష్‌ను పరామర్శిస్తున్న ముత్తంశెట్టి మహేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురవాడ: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధి తిరుపతి లోకేష్‌ను వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఇతర నాయకులు పరామర్శించారు. జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలేనికి చెందిన తిరుపతి లోకేష్‌ను ప్రభుత్వం కుట్రపూరితంగా అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. బెయిల్‌పై వచ్చిన తిరుపతి లోకేష్‌ను గురువారం ఆయన నివాసంలో ముత్తంశెట్టి మహేష్ పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందన్ని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి గాదే రోశిరెడ్డి, వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, రాయిన సాయి, పోతిన మూర్తిబాబు, సియాద్రి కనకరాజు, పిళ్ల రమణ, పోతిన ఎల్లాజీ, పోతిన ప్రసాద్ ఉన్నారు.

చోరీ కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

18 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

పీఎంపాలెం: పీఎంపాలెం స్టేషన్ పరిధిలో భారీ చోరీకి పాల్పడిన ప్రధాన నిందితుడిని నేర విభాగం పోలీసులు అరెస్ట్ చేసి, చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను నార్త్ డివిజన్ క్రైం ఏసీపీ ఎ.వెంకటరావు వెల్లడించారు. గతేడాది అక్టోబర్ 6న పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీలో నివసిస్తున్న కె.ధనుంజయరావు ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో.. వెనుక తలుపు తాళాలు పగలు కొట్టి దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. 18 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి ఆభరణాలు దోచుకుపోయారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో ఆర్‌హెచ్‌కాలనీకి చెందిన గర్భాన అన్నంరాజు, మరో ఇద్దరు ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ప్రధాన నిందితుడు అన్నంరాజు హత్యాయత్నం కేసులో నిందితుడు కావడంతో గతంలో జైలుకు వెళ్లి ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యాడు. ఈ క్రమంలో క్రైం సీఐ బి.ఎస్.ఎస్ ప్రకాష్, ఎస్ఐ ఆర్.శ్రీనివాస్, సిబ్బంది అన్నంరాజును పీఎంపాలెంలో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అన్నంరాజు.. దొంగిలించిన ఆభరణాలను విజయనగరం, సబ్బవరం ప్రాంతాల్లోని కొంతమంది వ్యక్తుల వద్ద ఉంచినట్లు తెలిపాడు. దీంతో పోలీసులు 18 తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితుడు కె.అరుణ్‌కుమార్‌ను ఇప్పటికే అరెస్ట్ చేశారు. మైనర్‌ను జువెనైల్ హోమ్‌కు తరలించారు. కేసును ఛేదించిన సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

గుణుపూర్ పాసింజర్ గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-గుణుపూర్-విశాఖపట్నం (08522/08521) పాసింజర్ స్పెషల్ రైలు ముందుగా ప్రకటించినట్లుగా ఆయా తేదీల్లో రద్దు చేయడం లేదని, కేవలం గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ రైలు ఈ నెల 16, 17, 20, 23, 24వ తేదీల్లో నౌపడ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో నౌపడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ తేదీల్లో నౌపడ-గుణుపూర్ మధ్య ఈ రైలు రాకపోకలు సాగించవు.

పుస్తక పఠనంతో ప్రయోజనాలు

- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్
- విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ప్రారంభం


పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

మహారాణిపేట: డిజిటల్ యుగంలోనూ పుస్తకాలను చదివించడంలో విశాలాంధ్ర ఎనలేని కృషి చేస్తోందని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ అన్నారు. విశాలాంధ్ర 23వ పుస్తక ప్రదర్శనను గురువారం టర్నర్ చౌల్ట్రీలో పూర్వపు ఉపకులపతి ఆచార్య వి.బాలమోహన్‌దాస్, సీపీఐ ఫ్లోర్‌లీడర్ ఎ.జె.స్టాలిన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, విశాలాంధ్ర పబ్లిసింగ్ హౌస్ డీజీఎం టి.మనోహర్ నాయుడులతో కలసి కమిషనర్ ప్రారంభించారు. అనంతరం ప్రదర్శనలోని వివిధ రకాల పుస్తకాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కమిషనర్ మాట్లాడుతూ డిజిటల్ యుగం వైపు ఆసక్తి చూపుతున్నప్పటికీ పుస్తకాల పఠనంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. విశాలాంధ్ర ప్రత్యేక పుస్తక ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆచార్య బాల మోహన్ దాస్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పుస్తకానికి ప్రాధాన్యత తగ్గలేదన్నారు. స్టాలిన్ మాట్లాడుతూ డిసెంబర్ 10వ తేదీ వరకు పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు. విశాఖ ప్రజలు ఈ పుస్తక ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని మనోహర్‌నాయుడు కోరారు. విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ పి.ఎ.రాజు, అరసం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు, ఇస్కాఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.ఎస్.సుకుమారన్, సాహితీవేత్తలు కల్యాణరామారావు, మాటూరి శ్రీనివాసరావు, వెలమల సిమ్మన్న, సి.ఎస్.క్షేత్ర పాల్, తెలుగు దండు సూరి, శేఖర్ మంత్రి ప్రభాకర్ పాల్గొన్నారు.

మైథలాజికల్ థ్రిల్లర్ 'దేవకీ నందన వాసుదేవ'

డాబాగార్డెన్స్: అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే మైథలాజికల్ థ్రిల్లర్ మూవీ 'దేవకీ నందన వాసుదేవ'అని ఆ సినిమా హీరో గల్లా అశోక్ అన్నారు. సినిమా ప్రమోషన్లలో భాగంగా గురువారం చిత్ర బృందం విశాఖలో సందడి చేసింది. నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హీరో మాట్లాడారు. దర్శకుడు అర్జున్ జంధ్యాల కమర్షియల్ సినిమాకు వినోదం మేళవించి అద్భుతంగా తెరకెక్కించారన్నారు. ఈ సినిమాకు హను-మ్యాన్ దర్శకుడు ప్రశాంత వర్మ కథ అందించారని, ఈ చిత్రం ట్రైలర్, టీజర్లకు మంచి స్పందన వచ్చిందన్నారు. సూపర్‌స్టార్ మహేష్‌బాబుతో యాక్షన్ సినిమా చేయాలని ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మంచి చేయాలనుకునే వారికి దేవుడు ఎప్పుడూ వెంటే ఉంటారని, సాయం చేసే వారే దేవుడనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను రూపొందించినట్లు తెలిపారు. బోయపాటి శ్రీనివాస్ వద్ద తాను పనిచేసినట్టు దర్శకుడు అర్జున్ జంధ్యాల చెప్పారు. తెలుగు అమ్మాయి హీరోయిన్‌గా నటిస్తోందని, తప్పకుండా ఈ చిత్రం అందరికీ నచ్చుతుందన్నారు. హీరోయిన్ మానస వారణాసి మాట్లాడుతూ మోడలింగ్ నుంచి సినిమాల్లోకి వచ్చినట్లు తెలిపారు. మిస్ వరల్డ్ పోటీల్లో టాప్-10లో నిలిచానని గుర్తు చేశారు. సమావేశంలో నిర్మాత సోమినేని బాలకృష్ణ పాల్గొన్నారు.

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మానవత్వం



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: రక్తపు మడుగులో రహదారిపై పడి ఉన్న క్షతగాత్రుడిని చూసి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చలించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని సకాలంలో ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటారు. గురువారం ఆటోనగర్ బీ-బ్లాక్‌లోని టాటా మోటార్స్ షోరూం ఎదురుగా రెడీమిక్స్ కాంక్రీట్ లారీ ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాజువాక బీసీ రోడ్డుకు చెందిన ఓ వ్యక్తి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఈ ఘటనను చూసి ఆగారు. సంఘటన స్థలానికి చేరుకుని 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ అందుబాటులోకి రాకపోవడంతో.. ప్రైవేట్ అంబులెన్స్‌ను రప్పించి క్షతగాత్రుడిని అత్యవసర చికిత్స కోసం వడ్లపూడిలోని పవన్ సాయి ఆస్పత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందించడం వల్ల క్షతగాత్రుడి ప్రాణాలు నిలిచాయని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. కాగా.. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన రెడీమిక్స్ లారీని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

పేదలను వేధించేందుకేనా విచారణ?

మధురవాడ: గత ప్రభుత్వ హయాంలో నగర పరిధిలో ఇళ్ల స్థలాలు పొందిన పేదలను వేధించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. జీవీఎంసీ జోన్-2 పరిధిలో డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి అయిన విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవిని విచారణ అధికారిగా నియమించింది. ఈ మేరకు ఆమె గురువారం జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో జెడ్సీ సింహాచలం, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. గత ప్రభుత్వ హయాంలో జోన్ పరిధిలో 24,500 మంది సెంటు చొప్పున స్థలం పొందారు. వీరిలో అనర్హుల గుర్తింపు పేరుతో పునర్విచారణ చేపడుతున్నారు. ఇందుకోసం ఎన్ని బృందాలు ఏర్పాటు చేయాలి.. ఆయా బృందాల్లో ఎవరిని నియమించాలి.. ఎప్పటి నుంచి విచారణ చేపట్టాలనే అంశాలపై జోనల్ అధికారులతో ఆమె చర్చించారు. సెంటు స్థలం పొందిన లబ్ధిదారులకు జియో ట్యాగింగ్, నిర్మాణంలో ఉన్న, వివిధ దశల్లో ఉన్న ఇళ్లకు బిల్లులు మంజూరు వంటివి జరిగిపోయాయి. వివిధ దశల్లో వడపోత అనంతరం లబ్ధిదారులను అప్పట్లోనే ఎంపిక చేశారు. కొందరు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో మళ్లీ విచారణ చేపట్టడంపై విమర్శలు వస్తున్నాయి. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులను వేధించేందుకే ఈ విచారణ జరుగుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రిమాండ్‌కు నకిలీ పోలీస్

ఆరిలోవ: నకిలీ పోలీసుగా అవతారమెత్తి పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన వి.వెంకటరమణను ఆరిలోవ పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. పాడేరుకు చెందిన వెంకటరమణ నకిలీ పోలీసు వేషంలో పలువురి నుంచి సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలు తదితరవి చోరీ చేశాడు. మధురవాడలో సెల్‌ఫోన్లు విక్రయిస్తుండగా బుధవారం పీఎంపాలెం పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో కూడా వెంకటరమణపై ఇటీవల ఓ కేసు నమోదై ఉంది. దీంతో పీఎంపాలెం పోలీసులు అతన్ని ఆరిలోవ స్టేషన్‌కు అప్పగించారు. తెన్నేటిపార్కు సెక్యూరిటీ గార్డు నుంచి బైక్ చోరీ చేసిన ఘటనలో పోలీసులు విచారణ చేపట్టి.. గురువారం కోర్టులో హాజరుపరిచారు. కోర్టు రిమాండ్ విధించడంతో విశాఖ కేంద్ర కారాగారానికి తరలించినట్లు ఎస్ఐ కృష్ణ తెలిపారు.